ఆంధ్రభాషాసంస్కారిణీసభ.

[నంబూరి తిరునారాయణస్వామిపంతులుగారు బి. ఏ.]

(కార్యదర్శి వెంకయ్య ప్రవేశించుచున్నాడు.)

వెంకయ్య:—ఈయతిప్రాసలు నాప్రాణాలు తీస్తున్నవి. వీటిప్రయోజనము కనుపించదు. అవి వదలివేసి వ్రాయమంటే రోజుకొక నూరుపద్యాలు వ్రాయగలను. వీటిమూలాన నాకు నాటకరచన సాగకుండా ఉన్నది. అదుగో భాస్కరరావు వస్తున్నాడు.

(భాస్కరరావు ప్రవేశించుచున్నాడు.)

భాస్కరరావు:—ఏమండోయ్, వెంకయ్యగారు? ఈరోజున మన తెలుగుభాషకు సంస్కారము జరుగుతుందికాబోలు. ఎవరెవరే వంకలు తీర్ప దలచుకొన్నారు?

వెంకయ్య:—భాస్కరరావు, నీవు వేళాకోళంమనిషివైపోతున్నావు. నీవుగ్రంథరచనకు పూనుకోలేదుగనుక నీకు తెలియకుండా ఉన్నది.

భాస్కరరావు:—గ్రంథరచనకు నేనున్ను మొదలుపెట్టినాను తిరిగి విడిచిపెట్టినాను.

వెంకయ్య:—నీపుణ్యము తిరిగీ ప్రారంభంచేతూ? బ్రదికిపోతాము. ఎందుచేత విడిచిపెట్టావు? ఈదిక్కుమాలిన యతిప్రాసలచేత నేనా?

భాస్కరరావు:—అది యెందుకులే? ఒకసారినాకున్ను నీకుదోచినట్టే తోచింది. ఈగణాలు యతిప్రాసలు లేకుంటే చాలా రసవంతంగా ఇంగ్లీషుకావ్యముల ఫక్కీని కావ్యము వ్రాయవలెనని, తమాషాకు ఒక్కనాడు షేక్స్పియర్ను హాంలెట్టులోనుంచి కొంత తర్జుమాచేయడానికి మొదలుపెట్టాను. గణాలు యతిప్రాసలు తప్పుతూ వచ్చినయి అంతట వీనిని నాయిష్టమువచ్చినట్టు వేసుకుంటూ వ్రాసినాను. ఆతరువాత కొంతసేపటికి నాదగ్గిర శబ్దజాలములేక తెలుగులో పెట్టలేకపోయినాను. ఇంతలోకే వెంకటశాస్త్రిలుగారు వచ్చారు. వారికి ఇంగ్లీషులోనున్నదాని అర్థమంతా చెప్పినాను. ఆయనగారొక్కపావుగంటలో యతిప్రాసలు గణములు తప్పకుండా పద్యమువ్రాసియిచ్చినారు. అప్పుడునాకు తెలిసినది. శబ్దజాలము లేనిదోషముచేత నాకు సాగిందికాదన్నసంగతి. చదువుతక్కువ అయినవారికే యివిన్ని ప్రతిబంధకములుగానుండునుగాని కవితాధోరణి కలిగిచక్కగా జదువుకొన్నవారికివి అడ్డగింపవు.

వెంకయ్య:—చాల్లేవోయి, నీగర్వము, నీవుచదువుకొన్నవాడవు నేను చదువులేనివాడనని నీతాత్పర్యము.

భాస్కరరావు:—నీవు కోపములేకుండా మాటలాడితే నేను నిష్కపటముగా చెప్పుతాను. నీకు గవిత్వధోరణి అయినా తక్కువ అయియుండవలెను లేదా నీకు శబ్దజాలము తగినంత లేకుండానైనా యుండవలెను!

వెంకయ్య:—నాకు రెండూ తక్కువలేవు. యతిప్రాసలులేకుండా నేనువ్రాసిన పద్యాలు చూపించుతానుచూడు. ఎంతరసవంతముగానున్నవో. నాకోసంచెప్పడంలేదు.

భాస్కరరావు:—రసవంతంగా వ్రాసినట్టయితే నీగ్రంథము తప్పకుండా మెచ్చుకుంటారు. త్వరగాపూర్తిచేయరాదా మఱి అదియెదుటపెట్టి తర్వాతపోట్లాడవచ్చును.

(చలమయ్య ప్రవేశించుచున్నాడు.)

భాస్కరరావు:—వెంకయ్య, మనచలమయ్యగారువస్తున్నారు. వారికి యీగణాలు యతులు ప్రాసలు లెక్కలేదు.

చలమయ్య:—ఏమిటిబాబు. ఛందోనియమములు బాధించునా. కవిత్వము చెప్పగలవారికి నేను నిన్నటిదిన మొకక్రొత్తపద్యము వ్రాసినాను.

భాస్కరరావు:—ఏలాగోశలవియ్యండి. ఇదివరకున్న పద్యములలో దేనికి మార్చి వ్రాసి యేమిచేశారో.

వెంకయ్య:—ఉన్నపద్యమును మార్చడమెందుకు ప్రస్తరించి క్రొత్తపద్యమును వ్రాసియుందురు.

చలమయ్య:—ఆటవెలది మెలుగుదురా?

వెంకయ్య:—మెల్లగా. తానొక్కడే కవీశ్వరుడనని యీాయనగర్వం.

భాస్కరరావు:—ఆటవెలదికి నేమిచేసినారు? దానికి గొత్తసింగారమేదో చేయించారు, కావలెను.

చలమయ్య:—ఆటవెలదికిముందరనొక భగణముపెట్టినాను. అతిమనోహరమైనది. మోహిని అని పేరుపెట్టినాను.

భాస్కరరావు:—బలేబలే.ఇకదానినివదలకండి. ఇంకా దానికి కొత్తసింగారాలుచేసి భువనమోహినిగాచేయండి.

వెంకయ్య:—చలమయ్యగారూ. మీారునాతో ఒక్కవిషయములో నేకీభవిస్తున్నారు. ఇదివరకు ఆయావృత్తములకు నిరూపించబడియున్న గణములను మార్చుటగాని వానికిగొన్నిటిని చేర్చుటగానిచేసి శ్రావ్యమైనపద్యములు వ్రాయవచ్చునని, మఱి యతిప్రాసలుండవలె నంటారా?

చలమయ్య:—యతిప్రాసలులేకుంటే పద్యమెందు కౌతుందయ్య యతిప్రాసలులేకుండా వ్రాయవలెనంటే వచనకావ్యాలు వ్రాసుకోరాదా యేమిటి?

వెంకయ్యగారూ. మనగోపాలంగారు వచ్చినారు.

భాస్కరరావు. వెంకయ్యగారు ఎదురుగాబోయి తీసుకొనివచ్చుచున్నారు.

గోపాలం:—ఆకూర్చునవారెవరు?

వెంకయ్య:—చలమయ్యగారు. ఆయనగారు కొత్తవృత్తమొకటి మరల కల్పించినారట.

గోపాలం:—ఏమిటది.

భాస్కరరావు:—ఆటవెలదికి ముందో వెనకో కొంతచేర్చినారట. మోహనవృత్తమౌనదట.

గోపాలం:—కొంతచేర్చితే యేమైనట్టు. అటుయిటు ఆవెండిబంగారము కమ్మరించక పోయినారూ. అతిమోహనవృత్తమవుతుంది. దిక్కుమాలిన గొడవ. అబ్బబ్బా వీండ్లందరు ప్రజలను చంపేస్తున్నారు. దిక్కుమాలిన భాషపెట్టి, మనకు రానిభాషలో పుస్తకాలెందుకయ్యా! వాడుకకు భాషవకటి. పుస్తకాలకొకటా. మాట్లాడినట్టే ఉండాలె పుస్తకాలుకూడా?

భాస్కరరావు:—గ్రామ్యమువాడమంటారా యేమిటి?

గోపాలం:—వాడమంటారా యేమిటి? అందులోనే వ్రాయవలసినది. అదేఉపయోగము ప్రజలకు అర్థంకావలెనా? చాటుమాటు మాటలతోవ్రాస్తే యెవరికి తెలుస్తుంది.

వెంకయ్య:—గ్రామ్యభాషలో మనకు గ్రంథములెందుకండి. గ్రామ్యభాషలో నుపన్యాసములు చేతాము. అంతమట్టుకుచాలును.

గోపాలం:—ఉపన్యాసాలు గ్రామ్యములోనా, గ్రంథాలు వేరేభాషలోనా, నేను చెప్పుతున్నాను వినండి దేశము బాగుపడవలెనంటే మనము, గ్రామ్యభాషనే సర్వత్ర యుపయోగించవలెను.

(నాగభూషణం ప్రవేశించుచున్నాడు.)

నాగభూషణం:—నమస్కారమండోవ్, గోపాలంగారు.

గోపాలంగారు:—ఏమిటయ్యోవ్, నీసమాసాలతో మమ్మును చంపివేస్తున్నావే.

నాగభూషణం:—ఏమండోవ్, అలాఅంటారు. నాపుస్తకానికే అలాఅంటే తక్కినవారు వ్రాసేవాటి కేమంటారు? పద్యములంతా ఒక్కటేసమాసంగాను పాదమంతా ఒక్కసమాసంగాను వ్రాసేవారున్నారే. నాదానిలో అట్లులేదు. ఏపద్యములోను దీర్ఘసమాసములు నేను వెయ్యలేదే?

(సోమసుందరం ప్రవేశించుచున్నాడు.)

సో:—ఏమండోవ్ నాగభూషణంగారు, మీారెక్కడనూ దీర్ఘసమాసాలు వేయలేదనిన్ని పద్యమంతా సమాసంగా వ్రాసేవారు పాదమంతా సమాసంగ వ్రాసేవారు తేరా అంటున్నారు? అవును నాపద్యాలుకొన్ని అలాగేఉన్నయికాని, మీారు వచనమంతా సమాసములతో నింపివేసినారెందుకండీ, మూడేసిమూరల సమాసము లెందుకండీ వచనములలో. మీారు పద్యాలలో దీర్ఘసమాసములు వెయ్యనికారణమునాకు దెలుసునుఅంటే నేను గర్వపోతునంటారు. మీాకు పద్యాలలో దీర్ఘసమాసములు పెట్టుటకు యతిప్రాసలు బాధకంగాతోచి మానివేసినారు. మీారు చేసినపని మీాకు మంచిదా? ఇతరులు చేసినపని తప్పా.

వెంకయ్య:—అదుగో నేనుచెప్పలేదండీమరి. ఈ యతి ప్రాసలేనండి, చాలా బాధకమైనవి అవితీసివేయవలెనండి.

భాస్కరరావు:-ఈగొడవంతా యేమిటండి, పద్యకావ్యములే పనికిరావని గ్రామ్యభాషలోనే వ్రాయవలయునని కొత్తసిద్ధాంతములువచ్చుచుండగా మీయీసమాసముల ప్రయోగములను గురించి తగాయిదా యెందుకు?

నాగభూషణం:—వీరు గ్రామ్యములో వ్రాయమనగానే యెవరు వ్రాస్తారయ్యా.

సో:—వారే వ్రాసుకోవలెనుగాని మరెవ్వరూ వ్రాయరు.

వెంకయ్య:—అయితే మీరిద్దరూ వ్రాయకుంటె మరి వ్రాసేవారు లేరా యేమిటండి.

భాస్కరరావు:—ఇప్పుడు గ్రంథములు వ్రాసేవారికేమి కరువు. ఎవరి చిత్తమువచ్చినట్టువారు వ్రాయడం యెప్పుడేర్పడ్డదో అప్పుడే వ్రాతవ్రాసేవారేర్పడ్డారు. మంచి చెడ్డలెవరికి కావలెను.

నాగభూషణం:—మంచి చెడ్డలు చూడకుండానే ప్రజలు కొనుక్కుంటారండీ, పుస్తకంబాగుంటే విరివిగా ఖర్చు అవుతుంది. అదేగుర్తు.

భాస్కరరావు:-ఆమాటకేమిలెండి. పామరరంజకమైనవి ఉన్నయి పండితరంజకమైనవి ఉన్నయి. పామరరంజకమైనవి విశేషంగా ఖర్చుపడుతాయి. పామరరంజకముగా భాషఉన్నా పర్వాలేదు. గాని గొందరు భావములనే పామరరంజకముగా వుపయోగించుచున్నారు. ఇంతలో

(యోసేపుగారు ప్రవేశించుచున్నారు.)

భాస్కరరావు, వెంకయ్యగార్లు ఎదురుగాఁబోయి వెంటబెట్టుకొని వచ్చుచున్నారు. అంతట నచ్చటనున్నవారందరు వారిని గౌరవించి యుపవిష్టులను జేయుచున్నారు. ఆయోసేపుగారందరితోను ముచ్చటించుచున్నారు. ఒకరు యతిప్రాసల ప్రతిబంధమునుగురించి, యొకరు ఛందస్సువిపులము చేయుటనుగురించి, యొకరు గ్రామ్యభాషను గ్రంథములలోఁ బ్రయోగించుటనుగురించి యొకరు వచనకావ్యములు వ్రాయుచుఁ బద్యకావ్యములు వ్రాయుట మాన్పుటనుగురించి వారితో బ్రస్తావించుచున్నారు. ఇంతలో కోటంరాజుగారు, అన్నయాచార్యులుగారు, వెంకటశాస్త్రిలుగారు మరికొందరు ప్రవేశించుచున్నారు. వెంకయ్యగారులేచి సభయొక్క కార్య ప్రారంభమునకు వేళ అయినదని తెలుపుచున్నారు. అంతట యోసేపుగారు అగ్రాసనాధిపతిగా నుండుట తమయభిప్రాయమని గోపాలంగారు చెప్పుచున్నారు. దానికందరు నామోదించుచున్నారు. యోసేపుగారగ్రాసనాధిపత్యము వహించుచున్నారు.

వెంకయ్యలేచి, ఈనాడు మనమందరము తెలుగుభాషవృద్ధియగుటకుఁ దగిన సదుపాయములను గురించి యోచించుటకు నిచ్చటచేరినాము. కొందరు తమకు దోచిన సదుపాయములను ముందుగానాకు వ్రాతమూలకముగా దెలిపి వానిని సభవారి యెదురఁ బెట్టుమనికోరినారు వానినొక్కటొకటిగ బెట్టుదును. మీరందరు సాధకబాధకములు చక్కగాఁ బరిగణించి మీయభిప్రాయములను దెలుప వేడుచున్నాను. మొదటిది నరసింహముగారి యుద్దేశ్యము. "పద్యకావ్యములు వ్రాయుటమాని మనవారు గద్యకావ్యములే వ్రాసిన తెలుగుభాష వృద్ధియగునని" నరసింహముగారు వారియుద్దేశ్యమును విశదీకరించి ప్రస్తావింతురు.

యోసేపుగారు:—నరసింహముగారు ప్రస్తావింతురు గాక. నరసింహముగారంత లేచి గద్యకావ్యములు తెలుగు భాషయందు మిక్కిలియరుదుగానున్నవనియును, శాస్త్రవిషయములు సుబోధకముగ వ్రాయుటకు వచనకావ్యము లనుకూలముగా నుండుననియు, శాస్త్రపరిజ్ఞానము వలన దేశము నాగరికతవడసి సంపత్సమృద్ధిగనునుగావున జనులకు శాస్త్రవిషయిక గ్రంథములు మనవారుబహుళముగా వచనరూపమున వ్రాయుట శ్రేయోదాయకమనియుఁ బ్రసంగించిరి.

అంతట యోసేపుగారు సభవారిలో నెవ్వరైననిందున కాక్షేపించువారున్నయెడలఁ బ్రసంగింపవచ్చుననిరి. అంతట వెంకటశాస్త్రిలుగారు లేచి శాస్త్రవిషయిక గ్రంథములు దేశాభివృద్ధి కారణములగును గాని కావ్యములు ప్రబంధములు నాటకములు బుద్ధివికాసము కలిగించి చిత్తశుద్ధి కలిగించునవి కావున ముఖ్యముగ వ్రాయదగినవనియును

వీనివలన నీతి విస్తరించుటయేగాక కాలస్థితియు దేశస్థితియు స్పష్టముగ దెలియుచుండుననియు కావ్యరచనయు దేశాభివృద్ధి కారణమేయనియుఁ జెప్పిరి. మఱెవ్వరు బ్రసంగించుట కుద్యుక్తులు కానందున నరసింహ్వాముగారి యుద్దేశము నంగీకరించువారు చేతులెత్తవలయునని యోసేపుగారుచెప్పిరి. లెక్కపెట్టగా నలుగురు చేతులెత్తినవారైరి. అందున కాక్షేపించువారు చేతులెత్తవలయు ననిచెప్పగా సుమారు ముప్పదుగురు చేతులెత్తిరి.

తిరిగి వెంకయ్యగారులేచి "గ్రామ్యభాషలోనే గ్రంధములు రచించిన సర్వజనబోధకమై యుండును గావున గ్రంధరచనకుగూడ గ్రామ్యభాషవ్యవహరింపవలయును" అని గోపాలంగారి యుద్దేశము. అనిచెప్పిరి. యోసేపుగారు గోపాలంగారిని బ్రసంగింపుమనిరి. వారులేచి గ్రామ్యభాషయనునది గ్రంధములయందుఁ బ్రయోగింపబడకపోవుటచే సందిలమగుచున్నదిగాని వేఱుకారణములేదనియు దానిని గ్రంధములయందుఁ బ్రయోగించిననదియు మాన్యమగుననియు గ్రంధములు పామరజనులకునుబోధకముగ నుండుననియు విద్యావ్యాప్తికిమిక్కిలి యనుకూలమగునని యుముచ్చటించిరి. దానికాక్షేపణలు చెప్పుడని యోసేపుగారు సభవారినిఁగోరగా నాగభూషణముగారులేచి "ఆయాజాతులవారికిని నాయాదేశములవారికిని గ్రామ్యభాష వేరువేరుగా నున్నదనియు నది యవలంబించి గ్రంధము లందుబ్రయోగించిన సర్వజనగ్రాహ్యముగ నుండదనియు గంభీరభావములు తెలుపుటకు గ్రామ్యభాషచాలదనియు గ్రామ్యభాష గ్రంధములయందు బ్రయోగించుట యేదేశమందును సంప్రదాయకముగా లేదనియు, బ్రసంగించిరి. యోసేపుగారులేచి యీవిషయము లన్నిటినిగూర్చి తాము చివర నొక్కసారిగా బ్రసంగింతుమనియు గ్రామ్యభాష గ్రంధములయందుపయోగించుట కాక్షేపించువారు చేతులెత్తుడనియుజెప్పిరి. సభవారిలో ముప్పాతికమంది చేతులెత్తిరి.

వెంకయ్యగారులేచి సమాసప్రయోగము దగదని నాగభూషణముగారి యుద్దేశమనిచెప్పిరి. నాగభూషణముగారంతట యోసేపుగారి కోరికమీద సులభముగ తేలిక పదములతో వ్రాయవలయునుగాని సమాసములు ప్రయోగింప గిట్టదని ప్రసంగించిరి. అంతట వెంకటశాస్త్రులుగారులేచి సమాసప్రయోగము విధికాదనియు తేలిక మాటలతో వ్రాయుట కావ్యగుణములలో నొకటిగా లాక్షణికు లిదివరకే నిర్ణయించినారనియు దీనింగూర్చి యిప్పుడొక నిబంధన కవసరములేదనియుఁజెప్పిరి.

అంతట నందరు నిబంధన మవసరములేదనిరి.

వెంకయ్యగారంతటలేచి యతిప్రాసలు కావ్యరచనకు బాధకములనియు నవి వదలివేసిన బాగుండుననియు బ్రస్తావించిరి. అవి బాధకముగా దలంచువారు గద్యకావ్యములు వ్రాయవచ్చుననిరి.

అంతట యోసేపుగారులేచి యిట్లు ముచ్చటించిరి.

"సభ్యులారా, మీరందరు తెలుగుభాషనువృద్ధిచేయ దలచిన సదుపాయములను చర్చించుచున్నారు. భాషను వృద్ధిచేయుటయనగా భాషలో గ్రంధములు బహుళముగఁజేయుటయనిగాదు. నీతిబోధకములును, శాస్త్రవిషయములునునైన గ్రంధములను నెక్కువగ వ్రాయుటకుఁ దగిన సదుపాయములేర్పరచి యట్టిగ్రంధములు వృద్ధియగునట్లు చేయుటయని నాకుదోచుచున్నది. అందుకైయేర్పరువవలసిన సదుపాయములనికొన్ని విషయములుజర్చించుట జరిగినది. కాని యివినాకు సమ్మతములుకావు. యతిప్రాసలు తీసివేయవలయునని, గద్యకావ్యములే వ్రాయఁదగునని, సమాసములు ప్రయోగించుట మానదగునని ఛందస్సు మార్చవలయునని మొదలైన వాంశములు చర్చింపబడినవి. గ్రామ్యభాషనే గ్రంధములయందుఁ బ్రయోగింపవలయునని కొందరిమతముగా నున్నది. నేను గ్రామ్యభాషను గ్రంధములయందుఁ బ్రయోగింపవలయుననువారి వాదమును గ్రహింపజాలకున్నాను. ఏదేశములోని యేభాషనుఁ బరిశీలించిచూచినను గ్రంధములయందుఁ బ్రయోగింపబడు భాషకును జనసామాన్యముచేత మాటలాడుకొనబడు భాషకును వ్యత్యాసము కలదు. గ్రామ్యభాషమాటలాడువారు నాగరికతలేనివారుగాఁ బరిగణింపఁబడుదురు. సలక్షణముగ మాటలాడుట నాగరికత చిహ్నముగా నెన్నబడుచున్నది. కాబట్టి గ్రామ్య

భాష గ్రంథములయందే కాక మాటలాడుకొనునప్పుడును నిషేధించుట నామతము. సర్వజనులకు సలక్షణమైన భాషయలవడునట్లు చేయవలయును. ఇకను యతిప్రాసలను దీసివేయుటను గురించియు సమాసభూయిష్ఠముగ నుండకుండ దేశమాటలతో రచించుటను గురించియు నిప్పుడు చర్చించనవసరము లేదు. ఏలయనగా సులభముగ వ్రాయుట కావ్యగుణములలో నొకటికావున ప్రతిగ్రంథకర్త తనకు సాధ్యమైనంతవరకు సులభశైలిని వ్రాయుటకు బ్రయత్నించును. యతిప్రాసలు తీసివేయవలయు ననువారు గద్యకావ్యములు వ్రాయవచ్చును. ముఖ్యమైన విషయములువిడిచి ఈయనవసరమైన యంశములతోఁ బ్రొద్దుపుచ్చుట యెందునకు? రసము వెల్లివిరియునట్లు వ్రాసిన గ్రంథకర్త తప్పక మెప్పువడయగలడు. రసస్ఫూర్తికలుగునట్లు వ్రాయుటకు శక్తిగల గ్రంథకర్త మార్గమును సర్వజనులు ననుసరింతురు.

ఇప్పుడు ముఖ్యముగ విచారించఁదగిన యంశమొకటి నాకు దోచుచున్నది. సర్వజన సుబోధమై, నీతిబోధమై, జ్ఞానప్రదమైయుండు గ్రంథములు పాఠశాలలలోని బాలురచేతఁ జదివించిన వారికి సులభశైలిని వ్రాయుటయు, నీతియు, నాగరికతయు జ్ఞానమును గలుగును. ఇప్పుడు చదువుకొనుచున్న బాలురే ముందు గ్రంథకర్తలు కాఁగలవారు గావున వారికిఁ జిన్ననాటినుండియు సులభశైలియు భావగాంభీర్యతయు గలుగునట్లు చదివించవలసిన గ్రంథములెయ్యవి? నాతాత్పర్యము తెలుగు బైబిలు. ఈబైబిలుమహాగ్రంథము వేదము. దీనంబోధింపబడని నీతులు,ధర్మములుమరి యెందును లేవు. సలక్షణమైనభాష, సర్వజనగ్రాహ్యము. ఈమహాగ్రంథమును మనబాలురందరుఁజదువునట్లుచేసిన సులభశైలిని నుత్కృష్టమైన గ్రంథములు వ్రాయుశక్తి కలుగును. కావుననీమహాగ్రంథములోని భాగములు పాఠగ్రంథములుగా నేర్పడు ప్రయత్నము మీరు చేయవలయునని నాతాత్పర్యము. మఱియు సకల జనులు ఆభాషయే మాటలాడుకొనునప్పుడును వ్యవహరింపదగును. యోసేపుగారిట్లు చెప్పి విరమించిరి. అంతట గోపాలంగారు లేచి, "ఈరాత్రి యోసేపుగారు శ్రమయనక యగ్రాసనాధిపత్యమువహించి మనలను మన్నించినందుకు వారికి సభవారివందనములు దెలుపుచున్నా" మని చెప్పిరి. అంతట నెవరిపాటికివారు వెళ్ళిపోయిరి.

ఆంధ్ర ... మదరాసు. TELUGU ACADEMY, MADRAS

ఆంధ్రదేశోద్యమము — దాని భావిస్థితి.

[చల్లా శేషగిరిరావుపంతులు బి. ఏ., గారు.]

హిందూదేశీయులకెల్లను హైందవజాతీయత పరమావధి. అన్ని సంఘములతోబాటు బలవత్తరమైన హైందవజాతీయ నిర్మాణముకొఱకు నాంధ్రులుకూడ తమయాత్మశక్తిని వినియోగించు నుద్దేశముతో నాంధ్రదేశమునందొక నూతనోద్యమమును బ్రారంభించినారు. దర్బారు వరములు లభ్యమగుటకుఁ బూర్వమే సాంఘిక, రాజకీయ, యార్థిక స్థితిని బలపఱచుకొనవలయునని స్థిరసంకల్పము జేసికొనియున్నారు. హిందూదేశపు రాజప్రతినిధియగు హార్డింజిప్రభువుగారి అప్రతిమానమైన రాజనీతివలనను, మన యేలికయగు శ్రీ జార్జిచక్రవర్తిగారి కృపారసమువలనను, నొకజాతికి సంబంధించి, యొక్కభాషను మాటలాడు జనులనందర నొకరాష్ట్రమునఁజేర్చిన, భవిష్యద్వృద్ధి శీఘ్రముగ నొందఁగలరని యంగీకరింపఁబడినది. ఇందుకును మన వైస్రాయిగారును చక్రవర్తిగారును సంస్తవనీయులు. ఈరీతి ననుసరించి, వంగ, విహార, దేశంబులు ప్రత్యేకరాష్ట్రంబులుగ మార్పబడినవి. వంగ విహారవాసులు గూడ నీయేర్పాటువలన సంతృప్తిఁజెందిరి. హిందూదేశపు చరిత్రలోనే క్రొత్తమార్పు ఆంధ్రదేశీయుల మనంబులయందు, డాగియున్న యాశయంబుల బ్రబోధింపఁజేసి, యాంధ్రజనోద్ధరణ హేతువగు నొకగొప్ప సంచలనము నుద్భవింపఁజేసెను. రాజనీతి విశారదుండగు హార్డింజిప్రభువుగారికి నాంధ్రులెల్లరు వారుజేసిన యీమహాకార్యమునకు గృతజ్ఞులు. వారి ప్రాణమున కపాయముగావింప బ్రయత్నించిన దుర్మార్గుల మీఁద నాంధ్రులెల్లరు దమ యాగ్రహమును వెలిబుచ్చియున్నారు.